## డిజిటల్ క్రాప్ బుకింగ్‌కు విధివిధానాలు ఖరారు

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జిల్లాల్లో డిజిటల్ క్రాప్ బుకింగ్ నిర్వహించేందుకు విధివిధానాలను వ్యవసాయ శాఖ ఖరారు చేసింది. దీని ప్రకారం వ్యవసాయ విస్తరణ అధికారులు క్లస్టర్ వారీగా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి మొబైల్ యాప్‌లో ఫొటోలతో సహా వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి క్లస్టర్‌లో 2 వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని స్పష్టం చేసింది. క్లస్టర్ పరిధిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రెండు వేల ఎకరాలు, మహిళా ఏఈవోలు 1,800 ఎకరాలు డిజిటల్ సర్వే చేయాలని వెల్లడించింది. కాగా ప్రభుత్వం సన్న ధాన్యానికి బోనస్ ఇస్తుండడంతో వరిలో ఏ విత్తన రకం వేశారనేది తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే రైతు పేరు, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు ఎంటర్ చేయాలి. రైతుల మొబైల్‌లో ఎన్ని ఎకరాల్లో పంట వేశారనే సమాచారం మెసేజ్ రూపంలో వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు సర్వే నంబరు వారీగా పంట పొలాన్ని సందర్శించి వివరాలను నమోదు చేయడంతో పాటు, ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పంట సాగు లేకపోతే నో క్రాప్ అని నమోదు చేయాలని సూచించింది. అక్టోబరు 25 నాటికి క్రాప్ బుకింగ్ పూర్తి చేసి 27న గ్రామపంచాయతీల్లో వివరాలు ప్రదర్శించాల్సి ఉంటుంది. పంటల నమోదులో తప్పులుంటే ఏఈవో దృష్టికి తీసుకెళ్లాలి. మార్పులు, చేర్పుల అనంతరం నవంబరు 5న తుది జాబితా ప్రదర్శిస్తారు.

## చేపల వినియోగంలో వెనుకబడిన రాష్ట్రం

### సగటు తలసరి వాడకం 8.37 కిలోలు

### ఉత్పత్తిలో 9వ స్థానం, తినడంలో 14వ స్థానం

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణలో చేపల వినియోగం జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. రాష్ట్రంలో ఉత్పత్తి అధికంగా ఉన్నప్పటికీ చేపల్లో ఉన్న పోషక విలువలపై అవగాహన లేక ప్రజలు వాటిని తినేందుకు వెనుకడుగు వేస్తున్నారు. సగటు తలసరి వినియోగం 8.37 కిలోలు మాత్రమే ఉండగా, ఇతర రాష్ట్రాలు అధిక వినియోగంతో ముందున్నాయి. చేపల వినియోగం పెంచడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. తెలంగాణలోని చాలా మందికి ముక్కలేనిదే ముద్ద దిగదు. సందర్భం ఏదైనా విందు భోజనంలో నాన్‌వెజ్ ఉండాల్సిందే. అయితే చాలా మంది కోళ్లు, మేకల్ని తింటున్నారే కానీ అత్యధిక పోషక విలువలు ఉండే చేపల్ని మాత్రం చిన్న చూపు చూస్తున్నారు. మత్స్యశాఖ తాజా అధ్యయన నివేదిక ప్రకారం దేశంలోనే తెలంగాణ ప్రజలు వెనుకబడి ఉన్నారు. దేశంలో 72.1 శాతం మంది ప్రజలు చేపలను ఆహారంగా తీసుకుంటుండగా తెలంగాణలో కేవలం 58 శాతం మంది మాత్రమే వాటిని తింటున్నారు. తెలంగాణలో సగటు తలసరి చేపల వినియోగం ఏడాదికి 8.37 కిలోలు. ఇది దేశ సగటు అయిన 13.1 కిలోల కంటే చాలా తక్కువ. దేశంలో చేపల వినియోగంలో తెలంగాణ 14వ స్థానంలో ఉంది. తెలంగాణ ఏటా 4,77,283 టన్నుల చేపలను ఉత్పత్తి చేస్తూ దేశంలో 9వ స్థానంలో నిలిచింది. ఉత్పత్తిలో ముందున్నా.. వినియోగంలో మాత్రం వెనుకబడటం గమనార్హం. దేశంలో చేపల వినియోగం గణనీయంగా పెరుగుతోంది. 2020లో సగటు తలసరి వినియోగం 8.9 కిలోలు ఉండగా, ఇప్పుడు అది 13.1 కిలోలకు చేరింది. 2030 నాటికి 19.8 కిలోలకు, 2048 నాటికి 41 కిలోలకు పెరుగుతుందని అంచనా. అత్యధిక వినియోగం త్రిపుర (27.62 కిలోలు), కర్ణాటక (20.72 కిలోలు), కేరళ (20.65 కిలోలు) మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. అత్యల్ప వినియోగం రాజస్థాన్ (0.8 కిలోలు), పంజాబ్, హర్యానా (0.3 కిలోలు) చివరి స్థానాల్లో ఉన్నాయి. కేరళ (53.5) గోవా (36.2) రాష్ట్రాల ప్రజలు రోజూ చేపలు తింటున్నారు. తెలంగాణతో పాటు తక్కువ వినియోగం ఉన్న రాష్ట్రాల్లో ప్రజలకు చేపల పోషక విలువలపై అవగాహన కల్పించాలని జాతీయ మత్స్యశాఖ సూచించింది.

## కొత్త కృషి విజ్ఞాన కేంద్రాలు మంజూరు చేయాలి

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణకు కొత్త క్రిషి విజ్ఞాన కేంద్రాలను మంజూరు చేయాలని కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో మంగళవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్ర అధిక శాతం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని, వీరికి బలమైన సాంకేతిక, వ్యవసాయ మద్దతు అవసరమన్నారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 12.40 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు అవుతుండగా, తద్వారా వార్షిక ఉత్పత్తి 71.52 లక్షల టన్నులు దాటిందని వివరించారు. అయినప్పటికీ రాష్ట్రంలో కేవలం 16 జిల్లాల్లో మాత్రమే క్రిషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయని, మిగిలిన జిల్లాలకు సాంకేతిక సహకారం లేకపోవడం పెద్ద లోటన్నారు. ఈ నేపథ్యంలో, ప్రతి జిల్లాలో ఉండేలా మరో 16 కొత్త వాటిని మంజూరు చేయాలని అభ్యర్థించారు. కేంద్రం మద్దతు ఇస్తే, వ్యవసాయ అభివృద్ధిలో తెలంగాణ పెద్ద అడుగు వేసి, రైతుల ఆదాయాలను పెంపొందించి, గ్రామీణ జీవనోపాధి మెరుగుపరచి, దేశవ్యాప్తంగా వ్యవసాయ వృద్ధికి విశేషంగా తోడ్పడగలదన్నారు. అలాగే రాష్ట్రానికి అదనంగా 25 వేల స్ప్రింక్లర్ల సిస్టమ్స్ కేటాయించాలని సూచించారు. తెలంగాణ వ్యవసాయ ప్రాధాన్యత కలిగిన రాష్ట్రం కావడంతోపాటు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే దిశగా కృషి చేస్తోందని చెప్పారు. కాగా రబీ సీజన్లో ముఖ్యంగా వేరుశెనగ, పప్పుధాన్యాలు, క్యారెట్, బీట్‌రూట్ వంటి పంటలు వేసే చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై పోర్టబుల్ స్ప్రింక్లర్ యూనిట్లు అందించేలా రాష్ట్రానికి అదనంగా కేటాయించాలని కోరారు.

## సైబర్ క్రైం బాధితులకు 187 శాతం పెరిగిన రిఫండ్

### లోక్ అదాలత్ ద్వారా 1324 కేసుల పరిష్కారం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** సైబర్ క్రైం బాధితులకు సిటీ సైబర్ క్రైం పోలీసు విభాగం సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల నుంచి ఇప్పిస్తూ బాధితులకు అందజేస్తున్న చెల్లింపుల శాతం 187 శాతం పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 1324 కేసుల్లో రెండు కోట్ల 81 లక్షల 16 వే ల 25 రూపాయలను బాధితులకు అందజేశారు. ఈ ఏడాది మొదటి త్రై మాసికం (జనవరి నుంచి మార్చి వరకు) 294 కేసుల్లో 52 లక్షల 38 వే ల 057 రూపాయలు, రెండవ త్రైమాసికం (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) 433 కేసుల్లో 78 లక్షల 19 వేల 212 రూపాయలు అందించగా మూడ వ త్రైమాసికం (జూలై నుంచి సెప్టెంబర్ వరకు) 697 కేసుల్లో కోటి 50 లక్షల 58 వేల 761 రూపాయలను బాధితులకు అందజేశారు. ఇందులో మొదటి రెండు త్రైమాసికాలతో పోలిస్తే మూడవ త్రైమాసికంలో సైబర్ బాధితులకు రిఫండ్ శాతంలో 187 పెరుగుదల వుంది. గత ఏడాదితో పోలి స్తే మొత్తం మీద ఇది 137 శాతం పెరుగుదలగా వుంది.

**లోక్ అదాలత్ ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలు, ఈ పెట్టి కేసులు, డ్రంకన్ డ్రైవ్ తదితర కేసులకు మోక్షం:** ఇదిలావుండగా ఈ నెల లో జరిగిన లోక్ అదాలత్ ద్వారా 1977 సాధారణ ఎఫ్ఐఆర్‌లతో పాటు 21,394 ఈ పెట్టి కేసులకు పరిష్కారం లభించి ంది. దీంతో పాటు 3803 ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులకు కూడా మోక్షం లభించింది. ఆయా కేసుల్లో నిందితులుగా వున్న వారు నిబంధనల మేరకు కోర్టులు సూచించిన జరిమానాలను చెల్లించి కేసుల నుంచి విముక్తి పొందారు. వీటి ద్వారా ట్రెజరీకి మూడు కోట్ల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది.

## 22 నుంచి ఎప్ సెట్ బి ఫార్మసీ కౌన్సెలింగ్

### సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 16:** రాష్ట్రంలోని ఫార్మసీ కాలేజీల్లో బి ఫార్మసీ, ఫార్మ్ డి కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఎప్ సెట్-2025 ద్వారా ఎంపిసి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఈ నెల 22 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో ఇప్పటికే ఎప్ సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 25లోగా సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 25, 26 తేదీల్లో ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి చేరాల్సి ఉంటుంది. ఈ నెల 26న కాలేజీల్లో చేరిన విద్యార్థుల వివరాలను ఆయా కాలేజీలు ప్రకటించాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు.

## వైద్యులు మానవీయ కోణంలో సేవలందించాలి:మంత్రి కిషన్‌రెడ్డి

### సికింద్రాబాద్‌లో అత్యాధునీక పరికరాలతో మెడికవర్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రులు



సికింద్రాబాద్‌లో మెడికవర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** కార్పొరేట్ ఆస్పటల్స్ లాభాలు ఆశించకుండా డాక్టర్లు రోగులకు మానవీయ కోణంలో వైద్య సేవలు అందించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలో అత్యాధునీక పరికరాలతో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికవర్ సూపర్ స్పెషల్టీ ఆసుపత్రిని కేంద్ర మంత్రి బండి సంజయ్,రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో 8వ బ్రాంచ్‌గా నెలకోల్పడం అభినందనీయమన్నారు. ప్రజలందరికి నాణ్యమైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో దేశంలో 24వ నూతన ఆసుపత్రిగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. గతంలో తాను కరీంనగర్ సభలో మాట్లాడుతుండగా తనకు స్ట్రోక్ రావడంతో మెడికవర్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్ సాహులు వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడినందుకే కేంద్ర మంత్రిగా కొనసాగుతూ మెడికవర్ 24వ ఆసుపత్రి వేడుకల్లో పాల్గొన్నామన్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తారు కానీ, పునర్ జన్మ ఇవ్వడంలో డాక్టర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. అందుకు డాక్టర్లను దేవుళ్లుగా భావించాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను మెడికవర్ ఆసుపత్రి చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.అనీల్ క్రిష్ణ,ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ ఏ.శరత్‌రెడ్డిలు సత్కరించి దేశ వ్యాప్తంగా 14 వేల మంది ఉద్యోగులతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, కార్పోరేటర్లు చీరసుచిత్ర శ్రీకాంత్, కురుమ హేమలత, యాంకర్ సుమ,వైద్య నిపుణులు డాక్టర్ ప్రమోద్, డాక్టర్ క్రిష్ణప్రసాద్,డాక్టర్ హరిక్రిష్ణ,డాక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## 2030 నాటికి ఇవి బ్యాటరీలకు మూడురెట్లు డిమాండ్

### జాంబియా, చిలీలో గనుల కోసం ప్రయత్నాలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




దేశంలోని పలు బ్లాకులు, విభాగాలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న దృశ్యం

**గచ్చిబౌలి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** ఈవి బ్యాటరీలు, పునరుత్పాదక శక్తి సాంకేతికతకు 2030 నాటికి మూడు రెట్ల డిమాండ్ పెరుగుతుందని, దీని కారణంగా క్రిటికల్ మినరల్స్ అవసరం మరింత ఉంటుందని కేంద్ర గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ అవసరాన్ని ద ృష్టిలో ఉంచుకొని నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కింద ఇప్పటికే దేశంలో 4 ఐఐటీలు, 3 రీసెర్చ్ ల్యాబోరేటరీలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లుగా తీర్చిదిద్దామని తెలిపారు. గచ్చిబౌలిలోని టి-హబ్‌లో మంగళవారం కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సదస్సుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గత 11ఎళ్లుగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో ప్రతి రంగంలో శాస్త్రీయ ద ృక్పథం పెరిగిందన్నారు.కేంద్ర ప్రభుత్వ సంస్థ కాబిల్ ఇప్పటికే అర్జెంటీనాలో లిథియం బ్లాకును సొంతం చేసుకొని, వెలికితీత ప్రారంభించిందని, జాంబియా, చిలీల్లో సైతం గనులను దక్కించుకునేందుకు చర్చలు జరుగుతున్నాయని అన్నారు. క్రిటికల్ మినరల్స్ వెలికితీతకు జపాన్, పెరూ వంటి దేశాలతో అవగాహన ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలిపారు. బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల సేవలకు గుర్తింపుగా 1కోటి రూపాయల భీమా కవరేజీ అందిస్తున్నామని అన్నారు. అంతర్జాతీయ స్థాయి ఐఐటీ సంస్థలు మన దగ్గర ఉన్న కారణంగానే క్రిటికల్ మినరల్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లను ఏర్పాటు చేసుకొని ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రిటికల్ మినరల్ మిషన్ అధికారులు, గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఉస్మానియా మెడికల్ కాలేజీకి దేశంలోనే ప్రత్యేకత

### 10 అనుబంధ హాస్పిటళ్లు: వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 16:** దేశంలోని ఏ మెడికల్ కాలేజీకి లేని ప్రత్యేకత ఉస్మానియా మెడికల్ కాలేజీకి ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఒకటి లేదా రెండు హాస్పిటళ్లు మాత్రమే ఉంటాయని, కానీ ఉస్మానియా కాలేజీకి మాత్రం 10 అనుబంధ హాస్పిటళ్లు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి ఉస్మానియా హాస్పిటల్‌తోపాటు, నీలోఫర్ హాస్పిటల్, సరోజిని దేవి కంటి ఆస్పత్రి, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్, టీబీ అండ్ చెస్ట్ హాస్పిటల్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, సుల్తాన్ బజార్ మెటర్నిటీ హాస్పిటల్, పెట్లబుర్జు మెటర్నిటీ హాస్పిటల్, ఈఎన్‌టీ హాస్పిటల్, ఫీవర్ హాస్పిటల్ అనుబంధంగా ఉన్నాయన్నారు. ఒకప్పుడు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంత పేషెంట్ల ప్రాణాలను ఈ హాస్పిటళ్లే నిలిపాయని మంత్రి గుర్తు చేశారు. 5 వేలకుపైగా బెడ్లతో, ఒక్కో హాస్పిటల్ ఒక్కో స్పెషాలిటీలో లక్షల మందికి వైద్య సేవలు అందిస్తున్నాయన్నారు. వివిధ ప్రత్యేకతలతో ఎంతో ముందు చూపుతో ఏర్పాటైన ఈ హాస్పిటళ్లకు, పూర్వవైభవం తీసుకొద్దామని..



ఇందుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని మంత్రి సూచించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటళ్ల పనితీరు, ఆయా హాస్పిటళ్లలో అత్యాధునిక వసతుల కల్పన ఇతర అంశాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్ని హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా హాస్పిటళ్ల పనితీరు, పేషెంట్లకు అందిస్తున్న సేవలు, సాధించిన విజయాలు, సమస్యలపై అధికారులు మంత్రికి వివరించారు. ఉస్మానియాకు అనుబంధంగా ఉన్న ఒక్కో హాస్పిటల్‌కు వంద సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందని మంత్రి రాజనర్సింహ అన్నారు. గత వైభవాన్ని పునరుద్ధరించేందుకు, ఇప్పటి అవసరాలకు అనుగుణంగా హాస్పిటళ్లలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కూడా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. హాస్పిటళ్లను ఆధునీకరించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్‌కు మంత్రి సూచించారు. ఈఎన్‌టీ హాస్పిటల్ కోసం కొత్త బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, ఉస్మానియా డెంటల్ కాలేజీకి సంబంధించిన భూమి సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్ని మంత్రి ఆదేశించారు. అన్ని హాస్పిటళ్లను తానే నేరుగా విజిట్ చేస్తానని, పేషెంట్లకు అందుతున్న సేవలపై నేరుగా వారితోనే మాట్లాడుతానని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి తెలిపారు.

## మైనారిటీ గురుకులాల్లో మారిన టైం టేబుల్

### ఉదయం 5 గంటలకు నిద్ర లేవడం మొదలు

### ఉదయం 9 నుంచి 3.45 వరకు క్లాసులు

### రాత్రి 9.15 నుంచి నిద్ర

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 16:** రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాల టైం టేబుల్‌లో మార్పు చేస్తూ గురుకుల సొసైటీ నిర్ణయం తీసుకుంది. గురుకుల సొసైటీ టైమ్ టేబుల్‌లో మార్పులపై టిఎస్ యుటిఎఫ్ హర్షం వ్యక్తం చేయగా.. పిఆర్‌టియు టిఎస్ తమ సంఘం తరపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ప్రాతినిధ్యం మేరకు గురుకుల సొసైటీ అధికారులు టైమ్ టేబుల్‌లో మార్పులు చేశారని ప్రకటన జారీ చేశారు. మారిన టైమ్ టేబుల్ ప్రకారం ఉదయం 5 గంటలకు విద్యార్థులు నిద్ర లేవాల్సి ఉంటుంది. గంటపాటు వామ్ అప్ చేసుకోవాలి. ఉదయం 6.30 నుంచి 7.30 వరకు స్టడీ అవర్ ఉంటుంది. ఉదయం 8.15 నుంచి 9 గంటల వరకు బ్రేక్‌పాస్ట్. ఉదయం 9నుంచి 9.15 వరకు మార్కింగ్ అసెంబ్లీ ఉంటుంది. ఉదయం 9.15 నుంచి10 గంటల వరకు మొదటి పిరియడ్ కొనసాగనుంది. మధ్యాహ్నం 3.45 గంటల వరకు క్లాసులు కొనసాగుతాయి. సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు స్టడీ అవర్ కొనసాగుతుంది. రాత్రి 7.30 నుంచి 8.30 వరకు రాత్రి భోజనం ఉంటుంది. రాత్రి 8.30 నుంచి 9.15 వరకు సెల్ఫ్ స్టడీతోపాటు డైరీ రైటింగ్‌కి సమయం కేటాయించారు. రాత్రి 9.15 గంటలకు నిద్రపోవాల్సి ఉంటుంది. తిరిగి ఉదయం 5 గంటలకు నిద్ర లేవాలి. **కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు..**మైనారిటీ గురుకుల టైం టేబుల్ సవరించినందుకు టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, మైనార్టీ గురుకుల సెక్రటరీ షఫీఉల్లాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

## హనీ ట్రాప్ కేసు నివారణకు టిజిసిఎస్‌బి సరికొత్త వ్యూహం

### హనీపాట్ పేరిట సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు హైదరాబాద్ ఐఐఐటితో ఒప్పందం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా పెరిగిపోతున్న హనీ ట్రాప్ కేసులను కనీస స్థాయికి తగ్గించేందుకు తెలంగాణ సైబర్ సె క్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) కొత్త తరహా అస్త్రాన్ని ఎంచుకుంది. అమాయకులను హనీ ట్రాప్ ద్వారా వంచించి కోట్లాది రూపాయలను వసూలు చేస్తున్న సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు టిజిసిఎస్‌బి హనీపాట్ పేరిట కొత్త కార్యక్రమాన్ని చేబట్టేందుకు హైదరాబాద్ ఐఐఐటితో ఒప్పందం ఒప్ప ందం కుదుర్చుకుంది. కేవలం హనీట్రాప్ కేసుల్లో నేరగాళ్లుగా వుండే వారిని ఆకర్షించేందుకే హనీపాట్‌ను అమలు చేయనున్నారు. ఈ తరహా ఘటనల్లో పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నవి తక్కువేనని టిజిసిఎస్‌బి అధికారులు చెబుతున్నారు. మెజారిటీ ఘట నల్లో బాధితులు కుటుంబ పరువు కోసం గప్‌చిప్‌గా వుంటున్నారు. అయితే నేరగాళ్ల పదే పదే బ్లాక్ మెయిలింగ్‌కు దిగడంతో తప్పనిసరి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. ఇక ఈ తరహా కేసుల్లో సైబర్ నేరగాళ్ల ఎక్కువగా మాల్‌వేర్ టెక్నాలజిని వాడి మెయిల్స్ పంపుతున్నారని పోలీసుల విచారణలో తేలింది. ఇందుకోసం నకిలీ నెట్‌వర్క్‌లు సృష్టించి తప్పుడు ప్రొఫైళ్లు తయారు చేస్తున్నారని కూడా తేలింది. ఇందుకుగానూ సమాజంలో పలుకుబడి, డబ్బున్న వారిని సోషల్ మీడియా ద్వారా చిరునామాలు సేకరించడం సైబర్ నేరగాళ్ల చేస్తుంటారని పోలీ సుల విచారణలో తేలింది. దీని తరువాత అందమైన యువతుల ఫోటోలను తమ ప్రొఫైళ్లలో వుంచుకుని ముందుగా సైబర్ నేరగాళ్ల పరిచయం చేసుకుంటారు. ఆనక మాటలు కలిపి చివరగా హనీ ట్రాప్‌ను అమలు చేసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతారు.

**హనీ ట్రాప్‌కు విరుగుడు హనీపాట్:** హనీట్రాప్‌కు విరుగుడుగా టిజిసిఎస్‌బి అధికారులు కొత్తగా హనీపాట్‌ను అమలు చేయసాగారు. కేవలం హనీ ట్రాప్ కేసుల్లో బాధితులుగా వున్న వారిని కాపాడేందుకు హనీ పాట్ పేరిట ఓ నెట్ వర్క్‌ను తీసుకువస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే దొంగలను పట్టుకునేందుకు పోలీసులు మారు వేషంలో వెళ్లి రహస్య ఆపరేషన్లు చేబట్టినట్లుగా చెప్పాలి. ఇందుకోసం హైదరాబాద్ ఐఐఐటిలో ప్రత్యేకంగా ఒక హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ హబ్‌లో ఇప్పటికే చిన్నపాటి పనులు మొదలవగా పూర్తిస్థాయిలో త్వరలో ప్రారంభంకానున్నాయి.

### చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఒళ్లు జలదరించే ఘటన

## గోనె సంచిలో మహిళ మృతదేహం

**హైదరాబాద్ సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** చర్లపల్లి రైల్వే స్టేషన్ దగ్గర గోనె సంచిలో మహిళ మృతదేహం కలకలంరేపింది. రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఒక గోనె సంచి కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గోనె సంచి విప్పి చూడగా ఒక మహిళ మృతదేహం కనిపించింది. వయసు 30 నుంచి 40 మధ్య ఉండొచ్చని తెలిపిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ గోడ వద్ద మహిళ మృతదేహం పడేసి వెళ్ళిపోవడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. చర్లపల్లి పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ పరిశీలిస్తున్నారు. కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..చర్లపల్లి రైల్వే స్టేషన్లో మూటకట్టిన గోనె సంచిలో నుంచి దుర్వాసన వచ్చింది. మహిళ మృతదేహాన్ని సంచిలో తీసుకొచ్చి పడేసి గుర్తు తెలియని దుండగులు అక్కడ నుంచి వెళ్ళిపోయారు. రెండు రోజుల క్రితం హత్య చేసిన ఆనవాళ్ళు, కుళ్ళిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు.

## విద్యుత్ రంగ సంస్కరణలు, డిస్కంల బలోపేతం

### మంత్రుల బృందం సమావేశంలో కేంద్ర ఇంధన శాఖ మంత్రి ఖట్టర్

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** విద్యుత్ రంగ సంస్కరణలు, రుణ ఉపశమనం, డిస్కామ్‌లను బలోపేతం చేయడానికి కేంద్రం కృషి చేస్తోందని కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. ఇందుకుగాను ప్రభుత్వ సంస్థలలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వేగవంతం చేయాలని రాష్ట్రాలను కోరారు. విద్యుత్ పంపిణీ, వినియోగాల సాధ్యతను పరిష్కరించడానికి ఏర్పాటు చేయబడిన మంత్రుల బృందం (గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్) మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్ అధ్యక్షతన ఐదవసారి సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణలను అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్రాలతో పాటు, నియంత్రణ సంస్థలు సహకార ప్రయత్నాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. వినియోగదారులకు విద్యుత్తును అందించడంలో పంపిణీ సంస్థల (డిస్కంలు) కార్యాచరణ, ఆర్థిక ఆరోగ్యం కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్రాలు అమలు చేయబోయే ప్రతిపాదిత ప్రణాళిక పంపిణీ సంస్థల రుణ భారాన్ని తగ్గించి, నమ్మకమైన విద్యుత్ సరఫరాను అందించడంలో వాటి సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో కేంద్ర ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ఇంధన మంత్రులు, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర విద్యుత్ సంస్థలు మరియు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## అక్టోబర్ నుంచి ఆన్‌లైన్‌లో మధ్యాహ్న భోజన బిల్లులు!

### పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, నారాయణ్‌పేట్‌లో అమలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 16:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన బిల్లులను ఇకపై ఆన్‌లైన్‌లో సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించిన చర్యలను పాఠశాల విద్య శాఖ ప్రారంభించింది. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులను సమర్పించడంలో ఆలస్యం అవుతున్నందున.. బిల్లుల చెల్లింపులోనూ ఆలస్యం అవుతోంది. దీంతో రాష్ట్రంలో ప్రతి ఏడాది మధ్యాహ్న భోజన బిల్లుల కోసం ఆందోళనలు, నిరసనలు జరుగుతున్న విషయం తెలిసిందే. దీనిని నివారించడానికి పాఠశాల విద్య ఉన్నతాధికారులు చర్యలు ప్రారంభించారు. ఇకపై అక్టోబర్ నెల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులను ఆన్‌లైన్‌లో సమర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో బిల్లులను సమర్పించడం కోసం ముందుగా మూడు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని నిర్ణయించారు. అందులో భాగంగా భద్రాద్రికొత్తగూడెం, పెద్దపల్లి, నారాయణ్‌పేట్ జిల్లాల్లో బిల్లులను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి ఐటి శాఖకి చెందిన సిబ్బందితో పాఠశాల విద్య శాఖ సంప్రదింపులు జరుపుతోంది. ఇకపై పాఠశాల స్థాయిలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్‌లో ఎలా సమర్పించాలి అనే అంశంపై ఐటి ఉద్యోగులుపాఠశాల శాఖ ఉద్యోగులకు వివరించారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో మొదటి కాలమ్‌లో విద్యార్థుల అటెండెన్స్‌ను తీసుకుంటారు. రెండో కాలమ్‌లో ఏజెన్సీ పేరు ఉంటుంది. మూడోకాలమ్‌లో మధ్యాహ్న కార్మికుల వివరాలు ఉంటాయి. ఇలా రూపొందించిన యాప్‌లో మొదటి కాలమ్ మాత్రమే ప్రతిరోజూ మార్చాల్సి ఉంటుంది. మిగిలిన రెండు కాలమ్స్ అలాగే ఉంటాయి కాబట్టి.. వాటి ద్వారా మధ్యాహ్న భోజనం బిల్స్‌ను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడానికి అవకాశం ఉంటుంది. సుమారు 19 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. 8వ తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి పథకాన్ని అమలు చేస్తుండగా.. 9, 10 తరగతి విద్యార్థులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే నిధులను ఖర్చు చేస్తున్న విషయం తెలిసిందే.

## ప్రతి నియోజకవర్గానికి ఒక అధునాతన దోభీఘాట్ నిర్మాణం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 16:** రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక అధునాతన దోభీఘాట్ నిర్మించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రజక వృత్తదారులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రజక వృత్తిదారుల అభివృద్ధిపై మంత్రి మంగళవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో షాద్ నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాలమయదేవి , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, బిసి సంక్షేమ శాఖ అధికారులు,రజక వృత్తిదారుల సంఘం నేతలు పాల్గొన్నారు. బలహీన వర్గాల్లో కుల వృత్తులపై ఆధారపడిన వారు మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని, ఆర్థికాభివృద్ధి సాధించేలా కుల వృత్తులు ఎదగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. రజక వృత్తిదారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## మతమార్పిడిచట్టాల పిటిషన్లపై రాష్ట్రాల వివరణ తర్వాతనే విచారణ

### చీఫ్‌జస్టిస్ బిఆర్ గవాయి ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 16:** రాష్ట్రాలు రూపొందించిన మత మార్పిడి నిరోధక చట్టాలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం ప్రకటించింది. ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హరియాణా, ఝార్ఖండ్, కర్ణాటక తమ వివరణ ఇవ్వడానికి నాలుగు వారాల గడువును ఇచ్చింది. రాష్ట్రాల ప్రతిస్పందన అందిన తర్వాత మతమార్పిడి నిరోధక చట్టాల అమలును నిలిపివేయాలన్న విజ్ఞప్తులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. పిటిషనర్లను రెండు వారాల తర్వాత రిజాయిండర్లు దాఖలు చేయడానికి అనుమతించింది. మత మార్పిడి చట్టాలపై స్టే విధించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను ఆరు వారాల తర్వాత పరిశీలిస్తామని వెల్లడించింది. పలు రాష్ట్రాలు రూపొందించిన మత మార్పిడి చట్టాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారించింది. రాష్ట్రాలు రూపొందించిన మత మార్పిడి నిరోధక చట్టాల చట్టబద్ధతను సవాలు చేస్తూ సిటిజన్స్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ అనే స్వచ్ఛంద సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఎన్జీఓ తరఫున సీనియర్ న్యాయవాది చందర్ ఉదయ్ సింగ్ సుప్రీంకోర్టు ఎదుట వాదనలు వినిపించారు. ప్రస్తుత మత మార్పిడి నిరోధక చట్టంలో ఉత్తర్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు మరింత కఠినమైన మార్పులను తీసుకొచ్చాయన్నారు.

